# ఇంతి చేయు పోరు ఇంతింత కాదయా...

'ఇంటిలోని పోరు ఇంతింతకాదయా.." అన్నాడు మహాకవి వేమన. వేమన పద్యాన్ని చిన్నప్పుడు అమ్మ చెపితే విని, అని మూడుసార్లకే అప్పగించేసాను. ఇప్పుడైతే బుర్ర పెరిగిందో-తరిగిందో నాకు తెలీదుగానీ దాని 'అర్థం' కచ్చితంగా తెలిస్తేగానీ అర్థమవదు-మెమరీలో ఉండదు.

'మెమరీలో ఉండదు' అనడానికి కారణం లేకపోలేదు. అయితే అది గుర్తు చేసేది మా శ్రీమతే - నాకు మందబుద్ధో-మరుపుతనమో ఉందిట. నిజమే నాకు అర్థం కాని విషయాలూ- అర్జెంట్ కాదనుకున్న విషయాలూ-ఆవిడకెంత ముఖ్యమైనా నా బుర్రకెక్కవ్.

దానికోసం అమ్మతో చిన్నప్పుడు తిన్న చివాట్లు లాంటివి కొంత డబుల్ డోస్‌లోనూ కొంత గౌరవంగానూ..వడ్డిస్తుంటుంది మా ఆవిడ.

అమ్మ కోపం వస్తే 'చవటా' అని తిట్టేది-ఈవిడగారు డబుల్‌డోస్‌లో గౌరవంగా 'మీరుట్టి చవట వెధవగారండీ' అంటుంటుంది.

సరే-భరించేవాడు భర్త అంటారు గదాని చచ్చినట్టు భరిస్తున్నా.

అయితే..చవట వెధవగార్నయ్యాను గదా! చిన్నప్పుడు 'చవటా' అని చక్కగా తిడుతూ..అమ్మ నేర్పిన వేమన పద్యాన్ని సంస్కరించాలని అనిపిస్తోందీ మధ్య. ఇంటిలోని పోరు ఇంతింత కాదయా అన్న పద్యపాదాన్ని-'ఇంతి' చేయుపోరు ఇంతింత కాదయా అని అనాలి అనే ఫీలింగ్ కలుగుతోంది.

నిజం-

మా ఆవిడ బంగార్తల్లేగానీ ఈమధ్య వేమన పద్యం పదే పదే జ్ఞాపకం తెచ్చేంత పోరు పెట్టేస్తోంది-దానికి పై 'సంగతి'గా నాచేత ఆ పద్యాన్ని రిపేరు చేయించి..'ఇంతి చేయు పోరు..' అని నిట్టూర్చే స్థాయికి తెస్తోంది.

ఇంతకీ..అసలు విషయం చెప్పకుండా ఉపోద్ఘాతం ఎక్కువ చెప్తున్నానని ఫీలవుతున్నారా?

నా బాధ ఎంత చెప్పుకున్నా తక్కువే..కొంతే చెప్పేనని అర్థం చేసుకోండి చాలు.

సరే..పాయింట్లోకి వస్తాను.

గత రెండు వారాలుగా మా ఆవిడ చేయు 'పోరు' ఇల్లు మారదామని!

ఈ ఇల్లు మారడం సుతరామూ నాకిష్టం లేదు.

"దేనికి సరూ" సౌమ్యంగానే అడిగాను.

"ఇల్లు మారడానికి కూడా కారణాలు కావాలా.." గయ్యిమంది.

నా నోరు మూతపడింది.

ఇంటి ఓనర్‌తో ఇబ్బందా?

నేను డ్యూటీకెళ్లాక ఎవరైనా సతాయిస్తున్నారా?

పక్క ఇంటివాళ్లు నచ్చలేదా?

నేను మామూలుగానే బుర్ర కెక్కించుకునేసరికి ఆలస్యం చేస్తానుగా...ఓ వారం గడిచాక ఆవిడ 'పోరు' స్థాయి పెంచింది. ఇంక బుర్రకి ఎక్కించుకున్నాను. తప్పలేదు.

★ ★ ★

"గురూ మాకో ఇల్లు వెతకాలి" అన్నాను ఫ్రెండ్ కృష్ణమూర్తితో.

"కొనడానికా"

"జోకులొద్దు...అద్దెకి.."

"అదేంటి-మీ ఇల్లు బాగానే వుంది. పైగా రెంట్ కూడా తక్కువగానే వుందిగా"

"ఎన్నైనా వుండవచ్చు- ఆ యింట్లో వుండే యోగం వుండాలిగా"

"ఏంటోయ్ డిప్రెస్డ్‌గా మాట్లాడుతున్నావ్.."

జవాబేం చెప్పాలో నాకు తెలియట్లేదు.

కష్టమ్మీద "ఇంతి చేయు పోరు ఇంతింత కాదయా" అన్నాను.

"ఓ...అక్కయ్య ఇల్లు మారమందా?" అన్నాడు కృష్ణమూర్తి.

"అవును"

"కారణం?"

"అర్థం కావట్లేదు"

"అడగలేదా?"

"అడిగి గొడవ పెంచుకోవాలని అనిపించట్లేదు"

కృష్ణమూర్తి కొంతసేపు ఆలోచించుకున్నాడు.

"సరే..ఎక్కడ కావాలి..ఇల్లు.."

"ఇక్కడేరా..ఇక్కడ స్కూల్లో పిల్లల్ని చేర్పించాం కదా"

"ఓ కరెక్ట్!"

"మెట్టుగూడ..సీతాఫలమండీ..మైలార్‌గడ్డ... ఆ ఏరియాల్లో అయితే పిల్లలకి దగ్గర"

★ ★ ★

వచ్చే ఆదివారం ప్లాన్ చేసుకుని ఇద్దరం ఇళ్లవేటకి వెళ్దామని డిసైడ్ చేసుకున్నాం..ఆదివారం వరకూ నా 'పోరు' ఆగుతుందా...అని నాకు టెన్షన్ వుంది. ఇంకా మూడు రోజులు గడవాలి!!

అయితే..చవట వెధవగార్నయ్యాను గదా! చిన్నప్పుడు 'చవటా' అని చక్కగా తిడుతూ..అమ్మ నేర్పిన వేమన పద్యాన్ని సంస్కరించాలని అనిపిస్తోందీ మధ్య. ఇంటిలోని పోరు ఇంతింత కాదయా అన్న పద్యపాదాన్ని-'ఇంతి' చేయుపోరు ఇంతింత కాదయా అని అనాలి అనే ఫీలింగ్ కలుగుతోంది.

ఆదివారం పొద్దున్నే కృష్ణమూర్తి వచ్చాడు.

నేను బాత్రూంలో ఉన్నాను.

సరస్వతితో మాట్లాడతాల్లే అని నేను ధైర్యంగానే వున్నాను.

స్కూటర్ మీద ఇళ్లవేటలో వెళ్తూ న్నప్పుడు కృష్ణమూర్తి చెప్పాకే మా ఆవిడ అభిప్రాయం నాకు తెలు స్తోంది. కారణం తెల్సి నాకు గొల్లున నవ్వొచ్చింది.

కృష్ణమూర్తిని..ఆగమని స్కూటర్ దిగి విషయం తెల్సుకున్నాను.

సరస్వతి ఈ వీధిలోకి వచ్చే పని మనుషుల్నందర్నీ వాడిందిట. వాళ్లె వరూ ఈమెగారికి నచ్చలేదుట!

ఈవిడ ఇంటికి వెళ్లాలం టేనే..దణ్ణం పెట్టేసే స్థితికి వచ్చేశా రుట వాళ్లంతా.

ఆవిడ అహం కాపాడుకోవటా నికే- ఇల్లు మారాలిట!

ఇప్పుడీ ఇళ్లవేట..!!

తిరిగి తిరిగి ఓ చోట ఇల్లు పట్టాం.


ఓనర్ వేరే చోట ఉంటుందిట! పైన ఉన్నవాళ్ళు ఇల్లు చూపించారు.

థేంక్‌గాడ్! అనుకుంటూ..ఇల్లు చూసాను.

పిల్లల స్కూల్‌కి దగ్గరే..అద్దె బాగా ఎక్కువే..కొంచెం కష్టమే.

"ఓకే..ఎక్కడో..అక్కడ ఎంతకో కొంతకి ఎడ్జెస్ట్ అవుదాం" అన్నాను. వెంటనే అడ్వాన్స్ ఇచ్చేశాను.

★ ★ ★



మేము ఇల్లు మారాం.

మా ఇంటి ఓనర్ కనిపించడా నికి మూడు రోజులు పట్టింది.

ఆవిడ వచ్చింది! చూడగానే మా ఆవిడా నేనూ షాక్ అయ్యాం. ఆ అమ్మాయి..పాత ఇంట్లో ఉన్నప్పుడు..మా పనిమనిషి!

మా ఆవిడ ఆఖరిసారి రిజెక్ట్ చేసిన పనిమనిషి ఈవిడే.

ఈ మహత్తర విషయాన్ని తట్టుకోవడానికి మా ఆవిడకి చాలా టైమే పట్టింది.

నాకు ఓదార్చడానికి ఎంత టైము పడుతుందో తెలియట్లేదు.

మా హౌస్ ఓనర్ "ఫికర్ జేయకున్రి.. గీ ఇంట్లా పని సెయ్యనీకి గీ గల్లీనిండా మస్తుమంది ఉన్నారు. మీకు ఆళ్లెవరూ నచ్చకపోతే..మరో ఇల్లు నేను సూసి పెడతాను.." అంది.

మా ఆవిడకి ఎప్పుడో మాటపడిపోయింది.

నాకు నోరొస్తే బావుండేది. ఆవిడ నోరు ఎప్పటికీ తెరవకుండా మాయించేవాణ్ని...

ఇంతిచేయు పోరు ఇంకెంత దూరమో- విశ్వదా భిరామ వినురవేమ- అని మనస్సులో పాడుకుంటు న్నాను.

●